నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పాతబస్తీలోని పాలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టీజీఎస్పీడీసీఎల్ చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. పురానీహవేలీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని చెత్తబజార్, పురానీహవేలీ, లక్కడ్ కోట్ తదితర ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



గౌలిపురా: ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఛత్రినాక డివిజన్ ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్ ఆలయాల నిర్వాహకులకు సూచించారు. మొఘల్‌పురా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన స్టేషన్ పరిధిలోని ఆలయాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆలయంలోని హుండీ డబ్బులను ఎప్పటికప్పుడు తీసివేసి భద్రపరచుకోవాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు జరిగితే వెంటనే ఛేదించేందుకు సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీను, ఎస్ఐ కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల స్థలంలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ పాత ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థలంలో హౌసింగ్ బోర్డు అధికారులు మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పాఠశాల భవనాన్ని ఇటీవల కొందరు వ్యక్తులు కబ్జాచేయడానికి ప్రయత్నించారు. 60 ఏళ్ల నుంచి విద్యాశాఖ ఆధీనంలో ఉన్న ఈ భవనాన్ని కబ్జా కోరల నుంచి రక్షించేందుకు స్థానికులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాల వారు ఈ స్థలాన్ని హౌసింగ్‌బోర్డు స్థలానికి అప్పజెప్పడంతో స్థానిక విజయనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హౌసింగ్‌బోర్డు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో విద్యాశాఖ అధికారులు ఎట్టకేలకు స్పందించి ఆక్రమణకు గురవ్వబోతున్న పాఠశాల భవనానికి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో విజయనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రెటరి అమరేందర్ రెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకునే కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినా హౌసింగ్ బోర్డు కార్యదర్శి రాజేష్‌కు స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తప్పించుకొని తిరుగుతున్న పాత నేరస్తుడి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో తప్పించుకొని తిరుగుతున్న పాత నేరస్తుడిని సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడకు చెందిన అలీ బిన్ మహ్మద్ జాబ్రీ రౌడీషీటర్. ఇతడు భూకబ్జా, చీటింగ్, పోర్జరీ, బెదిరింపులు, హత్యాయత్నం తదితర 21 కేసులలో నిందితుడిగా ఉన్నాడు. 11 ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్ ఉన్న ఇతడు చాలా కాలంగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్, ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదబాబు నేతృత్వంలోని ఎస్సైలు కవియుద్దీన్, సాయిరాం, మధు, బండ్లగూడ పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రాంగ్‌సైడ్‌లో వస్తే ఊరుకోం..

బంజారాహిల్స్: ద్విచక్ర వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించి రాంగ్‌సైడ్‌లో దూసుకుపోతూ ప్రమాదాలకు కారణమవుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రాంగ్ సైడ్ వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పెద్ద సంఖ్యలో రాంగ్‌సైడ్‌లో వస్తూ ద్విచక్రవాహనదారులు పట్టుబడ్డారు. వీరికి జరిమానాలు విధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతిరోజూ పలుచోట్ల వాహనదారులు రాంగ్‌సైడ్‌లో దూసుకెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఎక్కడ ఎక్కువగా ఇలాంటి పరిస్థితి ఉంటుందో ఆ ప్రాంతాలను గుర్తించి అక్కడే తనిఖీలు చేపడుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరు

- ఇష్టానుసారంగా వాహనదారుల రాకపోకలు
- నంబర్ ప్లేట్ల మార్పులు, చేర్పులు చేస్తున్న వాహనదారులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



గుల్జార్‌హౌజ్‌-మదీనా రోడ్డులో ఇష్టానుసారంగా రాకపోకలు

చార్మినార్: పాతబస్తీలో ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరవుతున్నాయి. పాతబస్తీలో దక్షిణ మండలంతో పాటు దక్షిణ పశ్చిమ మండలంలలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లున్నాయి. వీటి పరిధిలో రెండు, మూడు జాతీయ రహదారులతో పాటు ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లున్నాయి. ఈ రోడ్లలో ప్రతిరోజూ వాహనాల రాకపోకలు జోరుగా కొనసాగుతాయి. అయితే కొంత మంది వాహనదారులు నిబంధనలు పాటించకుండా వాహనాలను అడ్డదిడ్డంగా నడుపుతూ ఇతర వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నారు. విధి నిర్వహణలో పోలీసులున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులున్నాయి.

ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులో లేకపోవడంతో..

ప్రధాన కూడళ్లలో ఆశించిన మేరకు ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులో లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు విధి నిర్వహణలో ఉండాల్సినప్పటికీ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు తమ ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రోడ్లల్లో సైతం దూసుకెళ్తూ ఇతర వాహనదారులకు ఆటంకాలు కలిగిస్తున్నారు.

స్పీడ్‌గా దూసుకెళ్తూ..

అసలే ఇరుకు రోడ్లు..ఆపై రద్దీ ఎక్కువగా ఉంటుండటంతో స్పీడ్‌గా వాహనాలను నడపడానికి పాతబస్తీలో ఏ మాత్రం అవకాశం లేదు. అయినప్పటికీ.. కొంతమంది ఇష్టానుసారంగా దూసుకెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ అధికంగా ఉంటుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్ల మార్పులు..

పాతబస్తీలోని కొంతమంది వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకోవడానికి వాహనాల నంబర్ ప్లేట్లను మార్చేస్తున్నారు. ఆర్టీఏ ద్వారా మంజూరైన సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను కొంత మంది వాహనదారులు ఉద్దేశపూర్వకంగా మార్పులు, చేర్పులు చేస్తూ ఆర్టీఏ, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. కొంత మంది నంబర్ ప్లేట్లను కనిపించకుండా చేస్తుండటంతో మరికొంత మంది సగం వరకు నంబర్ ప్లేట్లను వంచేయడం.. ఇంకొంతమంది విరగ్గొట్టడం..ప్లాస్టర్లు అతికించడం..తదితర ఉద్దేశపూర్వక పనులకు పాల్పడుతున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు..

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. వెంటనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిని కట్టడి చేస్తాం. ప్రమాదాల బారి నుంచి తమను తాము కాపాడుకోవడమే కాకుండా ఇతరులకు ప్రమాదాలు కలిగించరాదంటూ అవగాహన కల్పిస్తాం. అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేస్తాం.

– లక్ష్మణ్, దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'స్పృజన టెక్‌ఫెస్ట్'



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

విజయనగర్‌కాలనీ: శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న ఆధునిక పద్ధతులను విద్యార్థులు తెలుసుకుంటూ ఈ పోటీ ప్రపంచంలో ముందుకెళ్లాలని మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కళాశాల ఆవరణలో 'స్పృజన టెక్‌ఫెస్ట్' పేరుతో విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ..విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకతకు కొదువలేదని వీరిలో దాగి ఉన్న పనితీరును వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహద పడుతాయన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో చక్కటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వివిధ విభాగాల్లో పోటీ పరీక్షలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర అధికారులు, న్యాయ నిర్ణేతలు, సిబ్బందితో పాటు వివిధ విద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



డ్రైనేజీ మురుగు నీటిని పరిశీలిస్తున్న అంజాదుల్లా ఖాన్

చార్మినార్: ఈది బజార్‌లోని హజ్రత్ షాబుద్దీన్ దర్గా ప్రాంతంలో డ్రైనేజీ మురుగు నీరు పొంగి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం అని ఎంబీటీ అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ అంజాదుల్లా ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానికుల ఫిర్యాదు మేరకు ఈది బజార్ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురుగు నీరు పొంగి ప్రవహించే ఈది బజార్ ప్రాంతం చార్మినార్ శాసనసభ నియోజకవర్గానికి చాంద్రాయణగుట్ట శాసనసభ నియోజకవర్గానికి మధ్యలో ఉంటుందన్నారు. దీంతో అటు ప్రజాప్రతినిధులతో పాటు ఇటు సంబంధిత అధికారులు సకాలంలో స్పందించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులతో పాటు జలమండలి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్లు, వీధుల్లో చెత్త వేస్తే చర్యలు



కొత్త చెత్త బిన్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రధాన రోడ్లు, బస్తీలలో చెత్త వేసే వారిని గుర్తించే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన బల్దియా శానిటేషన్, రామ్‌కీ విభాగం అధికారులు కొత్తగా ప్రవేశపెట్టిన చెత్త బిన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల విష జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెత్త బిన్స్‌లో చెత్తను వేస్తే పారిశుద్ధ్య సిబ్బంది దానిని సులభంగా తరలించే అవకాశం ఉంటుందన్నారు. కూరగాయల వ్యాపారులు తమ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారని ఇటువంటి వారిని గుర్తించి వారి లైసెన్స్ రద్దు చేయాలని ఆయన అధికారులను కోరారు. టోలిచౌకి టూంబ్స్ రోడ్డు, ఎండిలైన్స్, లంగర్‌హౌస్ రోడ్డు, కార్వాన్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం రోడ్లను తవ్వారని అయితే ఆ ప్రాంతంలో సైతం చెత్త యధేచ్ఛగా డంపింగ్ అవుతుందని ఆయన అన్నారు. ఇటువంటి ప్రాంతాల్లో చెత్త వేసే వారిని పట్టుకోని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో హర్షద్ అలీ, రామ్‌కీ ఖైరతాబాద్ జోన్ హెడ్ నందకిషోర్, రామ్‌కీ కార్వాన్ ఇన్‌చార్జి మురళీచక్రవర్తి, మజ్లిస్ నాయకులు ఆరూన్‌ఫరాన్ తదితరులున్నారు.

'ఏకాగ్రతతో సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు'



విజేతగా నిలిచిన జీఎన్ఐటీఎస్ బాస్కెట్ బాల్ టీమ్

గోల్కొండ: ఏకాగ్రతతో సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నిఖత్‌బాను అన్నారు. మంగళవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 11వ జాతీయ మహిళల ఇంటర్ ఇంజినీరింగ్ కాలేజీ మీట్-2025 ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్యాడ్మింటన్‌తో పాటు వాలీబాల్, బాస్కెట్ బాల్‌లో జీఎన్ఐటీఎస్ సత్తాచాటి చాంపియన్‌గా నిలిచింది. వివిధ పోటీల విజేతలకు ఆమె బహుమతులు అందించి మాట్లాడారు. జి.నారాయణమ్మ మహిళా కళాశాల అంటే తనకు ఎంతో ఇష్టమని ఇక్కడి విద్యార్థినులు కేవలం ఒక ఆటకే పరిమితం కాకుండా అన్ని రకాల క్రీడా పోటీల్లో పాల్గొనడమే కాకుండా చాంపియన్‌లుగా నిలుస్తున్నారన్నారు. కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి మాట్లాడుతూ..గతంలో కూడా తమ కళాశాల జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లకు వేదికగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ వైస్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్ రెడ్డి, వర్వ్ 2025 కన్వీనర్ డాక్టర్ ఎం.వి.ఎల్.సూర్య కుమారి, డాక్టర్ అపర్ణ పల్లె తదితరులున్నారు.

ఉమెన్ ఆఫ్ ది ఇయర్-2025 పురస్కారానికి సూర్యా ధనుంజయ్ ఎంపిక



సుల్తాన్‌బజార్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ సాహిత్యవేత్త, సీనియర్ ప్రొఫెసర్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యా ధనుంజయ్‌ని ఉమెన్ ఆఫ్ ది ఇయర్-2025 ఉత్తమ మహిళా పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి అడ్మిస్ట్రేషన్ ట్రిబ్యునల్ కోర్టు చైర్మన్ జస్టిస్ వామన్ రావు దేశ్‌పాండే, అమెరికా దేశ చికాగో స్టేట్, అమీర్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ చైర్మన్ ఫరూక్ అలీఖాన్, హైకోర్టు ప్రముఖ న్యాయవాది ఇట్టా ఉదయశ్రీ తదితరులు పాల్గొని ఈనెల 7న యూనివర్సిటీలో ఈ అవార్డును ప్రదానం చేస్తారని తెలిపారు.

కళాకారులకు న్యాయం చేయాలి

పంజగుట్ట: తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనువోజు వెంకన్న డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరాకంటి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గజవెల్లి ప్రతాప్, గ్రేటర్ బాధ్యుడు జవాజి ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జెకట్టి ప్రతి గ్రామంలో ధూందాంలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం నింపుతూ ఉద్యమాన్ని ముందుకు నడిపామని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సాంస్కృతిక సారథిలో కేవలం 551 మంది కళాకారులకే ఉద్యోగాలు ఇచ్చారని, అవికూడా అర్హులకు ఇవ్వకుండా డబ్బులు తీసుకుని ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, 15 నెలలు గడుస్తున్నా ఊసే లేదని అన్నారు. సమావేశంలో పాలాటి రాజు, డాక్టర్ సలీం, సత్యనారాయణ, నకిరకంటి చిరంజీవి, భూమయ్య, పుష్ప, కవిత పాల్గొన్నారు.

దార్శనిక నాయకురాలు అహల్యాబాయి

మణికొండ: లోకమాత దేవి అహల్యాబాయి హోల్కర్ దార్శనిక నాయకురాలని, ఆమె రాణిగా ఉన్న సమయంలో మాల్వా రాజ్యాన్ని జ్ఞానం, న్యాయం, శాంతి, శ్రేయస్సు, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలించారని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శైలజ అన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆమె 300వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆమె పాలనలో ఆలయాలు పునర్‌నిర్మించడం, రోడ్లు, బావుల నిర్మాణం చేపట్టి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆమె ప్రజలకు నిజమైన సేవ చేయాలని నమ్మిన సిద్ధాంతం కోసం కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద, కోఆర్డినేటర్‌లు మల్లీశ్వరి, సృజన, కన్వీనర్‌లు డాక్టర్ బి.నరేంద్రకుమార్, డాక్టర్ ఎ.రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వాణిదేవి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సాహిత్య అకాడమీల సౌజన్యంతో హైదరాబాద్ పాత నగర కవుల వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కొరుప్రోలు హరనాథ్ సమగ్ర కవితా పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి మాట్లాడుతూ..ప్రస్తుత యువతను సాహిత్య కవిత్వ ప్రక్రియలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. 8న రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు రచయిత, సాహితీవేత్తలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, పాలపిట్ట సంపాదకులు గుడిపాటి, రాజధాని బ్యాంక్ చైర్మన్ వేమిరెడ్డి నర్సింహారెడ్డి, రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, పాతనగర కవుల వేదిక కన్వీనర్ సీఎస్.రాంబాబు, తరుణి సంపాదకులు కె.నిహారిణి పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

జియాగూడ: కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించడంతో జియాగూడలో బీజేపీ అనుబంధ సంస్థలు సంబరాలు నిర్వహించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జగదీష్ యాదవ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చౌరస్తాలో మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జియాగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, ఓబీసీ అధ్యక్షులు జె.వెంకటేష్ యాదవ్, యువ మోర్చా అధ్యక్షుడు సందీప్ కుమార్, సీనియర్ నాయకులు దర్పల్లి నర్సింహా, జుగల్ కిషోర్, సుదర్శన్, తులసిదాస్, రమేష్ చౌగ్లే, ఉల్పే రాకేష్, కిషన్‌దామ, బాబూరావు, సాయికిరణ్, సతీష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో కార్వాన్ కో కన్వీనర్ శివకుమార్ యాదవ్ తదితరులు

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల సంక్షేమం



మీనాక్షి నటరాజన్‌ను సత్కరిస్తున్న నిర్మల్ కుమార్ యాదవ్

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల సంక్షేమం కొనసాగుతుందని ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గాంధీభవన్‌కు వచ్చిన నూతన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్మల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో పేద బడుగు వర్గాలు సంతోషంగా ఉంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శం అన్నారు.

తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయాలి



వాటర్‌బోర్డు ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: గచ్చిబౌలి టీఎన్జీఓ ముచువల్లి ఎయిడెడ్ కోఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీలో వాటర్ ఫెసిలిటీ, నల్ల కనెక్షన్లు, నూతన డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు, అదనపు నీటి పైప్‌లు ఏర్పాటు చేయాలని వాటర్‌బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి, టీఎన్జీఓ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని, టీఎన్జీఓస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ కస్తూరి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. జనరల్ మేనేజర్ ఖాదర్ నేతృత్వంలో కలిసి సొసైటీ ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి వినతిపత్రం ఎండీ అశోక్‌రెడ్డికి వారు సమర్పించారు. టీఎన్జీఓ సంఘం విజ్ఞప్తి మేరకు ఎండీ అశోక్‌రెడ్డి వెంటనే స్పందించి టీఎన్జీఓ కాలనీ సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేలా నూతన డ్రైనేజీ లైన్‌ల ఏర్పాటు చేయించడం, నల్ల కనెక్షన్ల ద్వారా సరఫరా అవుతున్న నీటి ప్రెషర్ పెంపు కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అధ్వానంగా కటోరా హౌస్



చెత్తాచెదారం, గుర్రపు డెక్కతో నిండిపోయిన కటోరా హౌస్

గోల్కొండ: చారిత్రక తటాకమైన కటోరా హౌస్ ఉనికి నేడు ప్రశ్నార్థకంగా మారింది. గోల్కొండ కోటలో ఆవాసం ఉండే అప్పటి కుతుబ్‌షాహి రాజులకు, సైనికులకు తాగునీరు అందించిన కటోరా హౌస్ నేడు అధ్వానంగా మారింది. ఇటు కేంద్ర పురాతత్వ పర్యవేక్షణ శాఖ, బల్దియా అధికారులు సుందరీకరణకు చర్యలు తీసుకోవడం లేదు. గత రెండు దశాబ్దాలుగా కటోరా హౌస్‌ను అభివృద్ధి చేస్తామని మేయర్లు, మంత్రులు, బల్దియా కమిషనర్లు హామీలు ఇచ్చి వెళ్లారు తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కొంత కాలం క్రితం మజ్లిస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే కటోరా హౌస్ సుందరీకరణ చేపట్టాలని కార్పొరేటర్లు, మజ్లిస్ నాయకులతో కలిసి కటోరా హౌస్ వద్ద ధర్నా నిర్వహించారు. అయినా అధికారుల్లో ఎటువంటి చలనం లేదు. నేడు కటోరా హౌస్‌లో మురుగు నీరు నిండి ఉంది తప్పా స్వచ్ఛమైన నీరు చుక్క కూడా లేదు. మరో వైపు దీనికి గతంలో వేసిన ప్రహరీ సైతం అధ్వానంగా తయారయ్యింది. ఇకనైనా అధికారులు కటోరా హౌస్‌ను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



ఉప్పుగూడ మహంకాళి ఆలయం రోడ్డులో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగు

చార్మినార్: అధికారుల అలసత్వం, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉప్పుగూడ మహంకాళి ఆలయం రోడ్డు నిలుస్తుంది. ఈ ప్రధాన రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. నెలల తరబడి మురుగు నీరు రోడ్డును ఆక్రమించడంతో అటువైపు నుంచి రాకపోకలకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. అమ్మవారిని దర్శించడానికి వెళ్లేటప్పుడు భక్తులు సాధారణంగా కాళ్లకు చెప్పులు లేకుండా వెళుతుంటారు. అయితే నిత్యం పొంగే ఈ డ్రైనేజీ మురుగు నీటి నుంచి చెప్పులు లేకుండా నడిచే పరిస్థితులు లేవు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ..అటు జలమండలి అధికారులతో పాటు ఇటు జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకున్న పరిస్థితులు లేవు. దీంతో నిత్యం ఈ రోడ్డులో రాకపోకలు సాగించే ప్రజలు భక్తులు భరించలేని దుర్వాసనతో నరకయాతన అనుభవిస్తున్నారు. సాధ్యమైనంత వెంటనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కలిపించాలని ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ సంబంధిత అధికారులు కోరారు.